# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 13, జులై 2026


## నకిలీ విత్తనాలతో దందా.. ముగ్గురిపై కేసు

**చింతలమానేపల్లి, జూలై 12, ప్రభాతవార్త:**



మండలంలో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తూ రైతులను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ ఎం. కమలాకర్ తెలిపారు. వ్యవసాయ శాఖ ఇన్చార్జ్ ఏఈఓ జ్ఞానేశ్వర్‌తో కలిసి పోలీసులు ఆదివారం మహారాష్ట్ర సరిహద్దులోని గూడెం గ్రామం వద్ద సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ద్విచక్ర వాహనంపై నకిలీ విత్తనాలు తరలిస్తున్న గూడెం గ్రామానికి చెందిన డేగ సంతోష్, దిందా గ్రామానికి చెందిన డొకె తిరుపతిలను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మహారాష్ట్రకు చెందిన చింతావర్ వెంకటేష్ అనే వ్యక్తి వద్ద వీరు 5 కేజీల నకిలీ పత్తి విత్తనాలను కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ విత్తనాలను స్థానిక రైతులకు రూ.లక్షల్లో ఎక్కువ ధరలకు విక్రయించి సొమ్ము చేసుకోవాలనే వ్యూహంతో తరలిస్తుండగా పట్టుబడ్డారని ఎస్ఐ వివరించారు. పట్టుబడిన ఇద్దరు నిందితులతో పాటు ప్రస్తుతం పరారీలో ఉన్న మహారాష్ట్రకు చెందిన వెంకటేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

# ఇక కాగితరహిత సేవలు..






- మీసేవలో డిజిటల్ విప్లవం
- ఆన్లైన్లోనే ఎస్సెస్సీ ఈ–మెమోలు
- దరఖాస్తుకు రూ.62 రుసుం
- విద్యార్థులకు సువర్ణావకాశం



2లో..

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 12, ప్రభాతవార్త :**

ప్రజలు, విద్యార్థులకు ప్రభుత్వ సేవలనుమరింత వేగంగా.. పారదర్శకంగా అందించేందుకు మీసేవ కేంద్రాలు సరికొత్త డిజిటల్ హంగులను అద్దుకున్నాయి. కాలయాపనను తగ్గించి, అవినీతికి తావులేకుండా జిల్లా యంత్రాంగం కాగిత రహిత (పేపర్ లెస్) పాలన దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే అటు రెవెన్యూ సేవల్లో విప్లవాత్మక మార్పులతో పాటు, ఇటు విద్యార్థుల కోసం సరికొత్తగా ఎస్సెస్సీ ఈ మెమోల సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఉన్నత చదువుల కోసం అడ్మిషన్ల ప్రక్రియ ముమ్మరంగా సాగుతున్న వేళ విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. మీసేవ పోర్టల్లో తాజాగా ఎస్సెస్సీ మెమో ఈకాపీ అనే సరికొత్త సేవను ప్రవేశపెట్టింది. 2004 నుంచి 2024వ సంవత్సరం వరకు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ డూప్లికేట్ ఈ-మెమోను మీసేవ ద్వారా పొందవచ్చు. కేటగిరీ ఏ కింద ఒక్కో దరఖాస్తుకు కేవలం రూ.62 రుసుం చెల్లిస్తే సరిపోతుంది.

## మంచిర్యాలలో పోలీసుల భారీ కార్డన్ సెర్చ్..

### సీపీ పర్యవేక్షణలో అర్ధరాత్రి ఆపరేషన్

● రూ. 20 వేల అక్రమ మద్యం, 166 ద్విచక్ర వాహనాలు, ఐదు ఆటోలు సీజ్

**మంచిర్యాల, జూలై 12, ప్రభాతవార్త**



మంచిర్యాల పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ కాలనీలో పోలీసులు అర్ధరాత్రి భారీ కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఇళ్లలో రహస్యంగా గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే విశ్వసనీయ సమాచారం మేరకు, పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్వయంగా ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షించారు. సుమారు 300 మంది ప్రత్యేక పోలీసు సిబ్బందితో కాలనీని పూర్తిగా చుట్టుముట్టి, తెల్లవారుజాము వరకు ఇల్లిల్లూ జల్లెడ పట్టారు. ఈ సోదాల్లో సుమారు రూ. 20,000 విలువైన అక్రమ మద్యం నిల్వలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు లేని 166 ద్విచక్ర వాహనాలు, ఐదు ఆటోలు, ఒక తల్వార్‌ను కూడా సీజ్ చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అర్ధరాత్రి రోడ్లపై పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న 10 మంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే, 10 మంది పాత నేరస్తులకు కూడా సీపీ కౌన్సెలింగ్ నిర్వహించి, భవిష్యత్తులో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ప్రజలకు రక్షణ కల్పించడమే ధ్యేయం అని సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, ప్రజలకు రక్షణ కల్పించడం, శాంతిభద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రతి పౌరుడు చట్టానికి గౌరవం ఇస్తూ సమాజానికి మిగతా 2లో..

## జిల్లాలో ఎస్ఐఆర్ పనులు ముమ్మరం

★ 7.55 లక్షల మందికి ఫారముల పంపిణీ పూర్తి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

★ ఇప్పటివరకు 42 శాతం డిజిటలైజేషన్ పూర్తి.. భైంసాలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష

**నిర్మల్, జూలై 12, ప్రభాతవార్త:**

జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 42 శాతం డిజిటలైజేషన్ పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. ఆదివారం భైంసా ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 23 మండలాల పరిధిలో గల 7 లక్షల 55 వేల మంది ఓటర్లకు ఎస్ఐఆర్ ఫారముల పంపిణీ పూర్తయిందని, వాటిని తిరిగి స్వీకరించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతోందని చెప్పారు. ప్రజల నుండి సేకరించిన మిగతా 2లో..





# జిల్లాలో ఎస్ఐఆర్ పనులు ముమ్మరం

(మొదటిపేజీ తరువాయి)

ఫారముల ఆన్‌లైన్ డిజిటలైజేషన్ పనులను వేగవంతం చేశామన్నారు. అయితే, గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియ కొంత నెమ్మదిగా సాగుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. భైంసా పట్టణంలో శనివారం సాయంత్రం వరకు 20 శాతం ఎన్యుమరేషన్ ఫారముల డిజిటలైజేషన్ మాత్రమే పూర్తయిందని వివరించారు.

**పట్టణాల్లో ప్రత్యేక జోన్లు..**

పట్టణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు వీలుగా ప్రత్యేక జోన్లుగా విభజించామని కలెక్టర్ తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ అధికారులు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), సూపర్‌వైజర్ల సమన్వయంతో ఇంటింటి సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు సమావేశంలో అధికారులు ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు అవగాహన కల్పించారు. ప్రతి బీఎల్ఓ తప్పనిసరిగా ప్రతి ఇంటికీ వెళ్లాలని, ఈ క్రతువులో స్థానిక ప్రజాప్రతినిధులు పూర్తిగా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, తహసీల్దార్ శశిభూషణ్, ఎంపీడీఓ నీరజ్, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణతో పాటు వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# మంచిర్యాలలో పోలీసుల భారీ కార్డన్ సెర్చ్..

(మొదటిపేజీ తరువాయి)

ఆదర్శంగా నిలవాలని కోరారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, లక్ష్యంతో ముందుక్కు సాగాలని సూచించారు. సమాజంలో నేరాలను అరికట్టడానికి పోలీసులకు ప్రజల సహకారం అత్యంత ముఖ్యమని ఆయన అన్నారు. ఈ కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో మంచిర్యాల డిసిపి ఏ. భాస్కర్,సి పి ఆర్ ప్రకాష్, పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు, పలువురు పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# రూ. 40 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన భోస్లే నారాయణరావు పాటిల్

**భైంసా, జులై 12, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావు పాటిల్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన దాదాపు 100 మంది లబ్ధిదారులకు రూ. 40 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తోందని, వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందని తెలిపారు. నిరుపేదలకు సకాలంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా నిధులను అందించి ఆదుకుంటున్నందుకు లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు, ఖానాపూర్ శాసనసభ్యులు వేద్మ బొజ్జుకు మరియు ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ భోస్లే నారాయణరావు పాటిల్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముధోల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి

**- ప్రభుత్వ ఆసుపత్రికి రెండు వీల్‌చైర్లు విరాళంగా అందజేసిన చట్ల గజ్జయ్య ఫౌండేషన్**

**బజార్‌హత్నూర్, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలో చట్ల గజ్జయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. దివంగత చట్ల గజ్జయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు చట్ల తరుణ్, కుమార్తె సౌమ్య ఈ కార్యక్రమాలను ఘనంగా చేపట్టారు. ఇందులో భాగంగా బజార్‌హత్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి రూ. వేల విలువైన రెండు వీల్‌చైర్లను ఫౌండేషన్ తరఫున విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా చట్ల తరుణ్ మాట్లాడుతూ.. తమ తండ్రి బ్రతికున్నంత కాలం ఎప్పుడూ ప్రజలతో మమేకమై ఉండేవారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా, అడుగుజాడల్లో నడవాలనే లక్ష్యంతోనే ఈ ఫౌండేషన్‌ను ప్రారంభించామని పేర్కొన్నారు. సమాజ సేవే పరమావధిగా చట్ల గజ్జయ్య ఫౌండేషన్ భవిష్యత్తులో కూడా ఇలాంటి అనేక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ విరాళం పంపిణీ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పరచ సాయన్న, గజ్జయ్య కుటుంబ సభ్యులు సాయికృష్ణ, వినాయక్, మణికంఠ, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఇక కాగితరహిత సేవలు..

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థి వివరాలను నమోదు చేసిన వెంటనే మీసేవ సెక్యూర్ బేస్ సర్టిఫికెట్లు ఈమెమో ప్రింట్ రూపంలో అందుతుంది. ఒరిజినల్ మెమోలు పోగొట్టుకున్న వారికి.. అత్యవసరంగా కావాల్సిన వారికి ఈ డిజిటల్ మెమో ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. పూర్తిగా కాగిత రహితం.. ఆఫీసుల చుట్టూ తిరిగే తిప్పలు తప్పుతాయి. మరోవైపు జిల్లావ్యాప్తంగా రెవెన్యూ సేవల దరఖాస్తు ప్రక్రియ లో సరికొత్త పేపర్ లెస్ విధానాన్ని అధికారులు మీసేవ కేంద్రంఅమల్లోకి తెచ్చారు. ఇకపై కులం, ఆదాయం, నివాస, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలతో పాటు ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికేట్ల కోసం దర ఖాస్తుదారులు ఎలాంటి పత్రాలను ఆఫీసుల్లో సర్పించాల్సిన అవసరం లేదు.

**తహసీల్దార్లకు స్పష్టమైన ఆదేశాలు**

క్షేత్రస్థాయి పరిశీలన పేరుతో దరఖాస్తుదారులను భౌతికపత్రాల కోసం వేధించవద్దని జిల్లా ఉన్నతాధి కారులు తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. ఎల క్ట్రానిక్ సర్వీస్ డెలివరీ సంస్థ ప్రవేశపెట్టిన నూతన మొబైల్ అప్లికేషన్ ద్వారానే తహసీల్దార్లు ఆన్లైన్ లోనే పత్రాలను పరిశీలించి.. వేగంగా డిజిటల్ సంతకాలతో సర్టిఫికెట్లను జారీ చేస్తున్నారు.

**సమయం, డబ్బు ఆదా..**

డిజిటల్ విప్లవంలో భాగంగా తీసుకొచ్చిన ఈ నూతన సంస్కరణలు ప్రజలకు, విద్యార్థులకు అటు సమయాన్ని, ఇటు డబ్బును ఆదా చేస్తాయని అధికారులు పేర్కొంటున్నారు. దళారుల బెడద లేకుండా.. కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా నేరుగా మీసేవ కేంద్రాల ద్వారా ఈ సరికొత్త సేవలను జిల్లా ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలి

**- మహాగాం సర్పంచ్ అప్పల రాజ్యలక్ష్మి రాకేష్**

**భైంసా, జులై 12, ప్రభాతవార్త:**

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై అర్హులైన వారందరూ ఓటు నమోదు చేసుకునేలా చూడాలని భైంసా మండల బీజేపీ నాయకురాలు, మహాగాం సర్పంచ్ అప్పల రాజ్యలక్ష్మి ్మ రాకేష్ పిలుపునిచ్చారు. ఈ ప్రక్రియ విజయవంతం కావడానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. ఆదివారం భైంసా మండలంలోని మహాగాంతో పాటు పలు గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీజేపీ బూత్ స్థాయి ఏజెంట్లకు ఆమె గుర్తింపు కార్డులను అందజేసి మాట్లాడారు. బోగస్ ఓట్లను పూర్తిగా తొలగించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ సర్వే చేపట్టిందని ఆమె తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ విషయంలో ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యంగా వలసవాదులను, బోగస్ ఓట్లను అడ్డుకునేందుకు ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా పనిచేస్తుందని పేర్కొన్నారు. అర్హులైన స్థానికులకు ఓటు హక్కు కల్పించేలా క్షేత్రస్థాయిలో కార్యకర్తలు చురుగ్గా కదలాలన్నారు. ఈ అవగాహన సదస్సు, కార్డుల పంపిణీ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, బీజేపీ బూత్ స్థాయి ఏజెంట్లు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి, ఉప సర్పంచులు, స్థానిక ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ కాంపల్లి లక్ష్మయ్యకు ఘన నివాళులు

**- పార్టీకి తీరని లోటు, యంసిపిఐ(యు) రాష్ట్ర నాయకులు**

**బెల్లంపల్లి జూలై 12, ప్రభాతవార్త:**



బెల్లంపల్లి పట్టణంలోని శంశీర్‌నగర్‌లో ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించిన యంసిపిఐ(యు) పార్టీ జిల్లా నాయకులు కామ్రేడ్ కాంపల్లి లక్ష్మయ్యకు పార్టీ రాష్ట్ర కమిటీ బృందం ఘనంగా నివాళులు అర్పించింది. యంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ గాదగోని రవి, పార్టీ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ సబ్బని కృష్ణతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష ్మయ్య నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2006లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పార్టీ ఆవిర్భవించినప్పటి నుండి కామ్రేడ్ లక్ష్మయ్య ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. ఆయనతో పాటు ఆయన భార్య కాంపల్లి రాధ కూడా ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ప్రజా సమస్యలపై పోరాటాల సమయంలో పోలీసుల అక్రమ కేసులు, నిర్బంధాలను కూడా వారు ధైర్యంగా ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా పదవీ విరమణ చేసిన తరువాత కూడా లక్ష ్మయ్య పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా కొనసాగారని, తన భార్యను కూడా పార్టీలోకి తీసుకువచ్చారని తెలిపారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్యలో కాంపల్లి రాధకు బాధ్యతలు అప్పగించినప్పుడు కూడా ఆయన సంపూర్ణ మద్దతు ఇచ్చారని చెప్పారు. పార్టీ సిద్ధాంతాలకు, క్రమశిక్షణకు కట్టుబడి తుదిశ్వాస వరకు పార్టీతోనే కొనసాగారని అన్నారు. లక్ష ్మయ్య సేవలు పార్టీకి చిరస్మరణీయమని, ఆయన మరణం తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆశయ స్ఫూర్తితో ఉద్యమాలను కొనసాగిస్తూ, జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడమే ఆయనకు నిజమైన నివాళి అవుతుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మంచిర్యాల జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్, ఆల్ ఇండియా కిషన్ ఫెడరేషన్ నాయకులు వల్లపు ఉపేందర్ రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్నం వెంకన్న, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకులు పుష్ప, రాగసుధ, రాష్ట్ర నాయకురాలు కుంభం సుకన్య, తాండ్ర కళావతి, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ

**భైంసా, ప్రభాతవార్త:**




జర్నలిస్టులకు సమాజంపై కలం బలం ఎంత ముఖ్యమో, కరుణ చూపడం కూడా అంతే ముఖ్యమని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) నిర్మల్ జిల్లా అధ్యక్షులు అరుగుల పోశెట్టి అన్నారు. సంఘం 12వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం భైంసాలోని ప్రభుత్వ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లను పంపిణీ చేసి ప్రత్యేక సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అరుగుల పోశెట్టి, ప్రధాన కార్యదర్శి మరాజు గంగాధర్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమంతో పాటు సమాజ సేవకు సమాన ప్రాధాన్యం ఇస్తూ ఇటువంటి మానవతా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. జర్నలిస్టులు కేవలం వార్తలను అందించడమే కాకుండా, అవసరమైన సందర్భాల్లో సమాజానికి అండగా నిలవడం కూడా తమ ప్రాథమిక బాధ్యతని పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా జర్నలిస్టుల శ్రేయస్సు కోసం, సంఘ బలోపేతానికి సేవ చేసే అవకాశం కల్పించిన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యులు ఉప్పల లక్ష్మణ్, నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) సభ్యులు ఫిరోజ్ ఖాన్, అక్రిడిటేషన్ కమిటీ బాధ్యులు ఎలుగు లింగన్న, రాజేందర్‌లకు వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో టీజేఏ జిల్లా వైస్ ప్రెసిడెంట్ అహ్మద్ ఇంతియాజ్ అలీ, కార్యదర్శి కె. రాజగౌడ్, ఈసీ మెంబర్ ఎండి. ఇసాక్ అలీ, ప్రభుత్వ వృద్ధాశ్రమం ఇన్‌చార్జ్ గడ్డం రాము మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం..

**- 150 ఏళ్ల చరిత్రకు సాక్ష్యం బంగారు పోచమ్మ**

**హాజీపూర్, జూలై 12, ప్రభాతవార్త:**

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని గొల్లపల్లి–పెద్దంపేట గ్రామాల మధ్య వెలసిన బంగారు పోచమ్మ అమ్మవారి ఆలయం సుమారు 150 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన అరుదైన ఆధ్యాత్మిక క్షేత్రంగా భక్తుల విశ్వాసాన్ని చాటుతోంది. తరతరాలుగా పూజలందుకుంటున్న ఈ ఆలయం నేడు వేలాది మంది భక్తులకు ఆరాధ్య దైవంగా నిలిచి, కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందింది. ఎన్నో దశాబ్దాలుగా అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలుస్తూ ప్రత్యేక పూజలు, మొక్కులు, బోనాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జీవితంలో ఎదురయ్యే కష్టాలు తొలగాలని, ఆరోగ్యం, కుటుంబ సుఖశాంతి కోసం భక్తులు అమ్మవారిని వేడుకుంటారు. తమ కోరికలు నెరవేరిన అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి తిరిగి వచ్చి మొక్కులు చెల్లించడం ఈ క్షేత్రంలో ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ ఆలయానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు మంచిర్యాల, కుమురంభీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల తదితర జిల్లాల నుంచి కూడా ప్రతి రోజు భక్తులు తరలివస్తుంటారు. పండుగలు, అమావాస్యలు, శ్రావణ మాసం సమయంలో ఆలయం భక్తులతో కిక్కిరిసిపోతుంది. గ్రామస్థులు, ఆలయ కమిటీ కలిసి ఆలయ సంప్రదాయాలను పరిరక్షిస్తూ, పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. కాలం మారినా, తరాలు మారినా అమ్మవారి మహిమపై భక్తుల నమ్మకం ఏమాత్రం తగ్గకపోవడం ఈ క్షేత్ర విశిష్టతకు నిదర్శనంగా నిలుస్తోంది.



# 14న రాష్ట్రవ్యాప్త కళాశాలల బంద్

**- ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు ప్రభుత్వం కుట్ర - ఏబీవీపీ రూ. 11 వేల కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలి**

**- రాష్ట్ర హాస్టల్ కోకన్వీనర్ బుదారి గంగా ప్రసాద్**



సమావేశంలో మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్ కోకన్వీనర్ బుదారి గంగా ప్రసాద్, కార్యకర్తలు

**భైంసా, జులై 12, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర హాస్టల్ కోకన్వీనర్ బుదారి గంగా ప్రసాద్ ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై రాష్ట్ర ప్రభుత్వ నిరక్ష్య వైఖరిని నిరసిస్తూ, జులై 14వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల నుండి యూనివర్సిటీ స్థాయి వరకు అన్ని రకాల విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. ఆదివారం భైంసా పట్టణంలో నిర్వహించిన ఏబీవీపీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి చదువుకుంటున్నారని గంగా ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడం వల్ల ప్రస్తుతం రూ. 11,000 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిరక్ష్య వైఖరి కారణంగా ఏటా 2 లక్షల మంది నిరుపేద విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపేస్తున్నారని, మరో 4.5 లక్షల మంది విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసినా మేనేజ్‌మెంట్లకు ఫీజులు చెల్లించలేక సర్టిఫికెట్లు తీసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి ప్రతి నెల ఫీజులు చెల్లిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తానే స్వయంగా విద్యాశాఖను కలిగి ఉన్నప్పటికీ బకాయిలు విడుదల చేయకపోవడం దుర్మార్గమన్నారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా పోరాడుతున్న విద్యార్థులపై లాఠీచార్జీలు చేయిస్తూ, అక్రమ కేసులు బనాయించడం సరికాదని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో విద్యాసంస్థలు మరోసారి ఉద్యమ వేదికలుగా మారి కాంగ్రెస్ ప్రభుత్వానికి మరణశాసనం రాస్తాయని హెచ్చరించారు. జులై 14న చేపట్టే రాష్ట్రవ్యాప్త కళాశాలల బంద్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మాధవ్, గణేష్, శివసాయి, రవి మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ కోదండరాం సన్మానిస్తున్న దృశ్యం

## 26న కాగజ్‌నగర్‌కు కోదండరాం రాక

**తెలంగాణ ఉద్యమకారులతో సమావేశం - హాజరు కావాలని పిలుపు**

**కాగజ్‌నగర్ రూరల్, జులై 12, ప్రభాతవార్త :**

తెలంగాణ జేఏసీ చైర్మన్, ఎమ్మెల్సీ, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ కోదండరాం ఈ నెల 26న కాగజ్‌నగర్‌కు రానున్నట్లు తెలంగాణ జేఏసీ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ కిషోర్ కుమార్, తెలంగాణ ఉద్యమకారుల వేదిక కన్వీనర్ ఈర్ల విశ్వేశ్వరరావు, సహ కన్వీనర్ సుభాష్, ఉద్యోగుల ఐకాస నాయకులు కటకం మధూకర్, యు.ఎన్. చారి తెలిపారు. ఆదివారం మంచిర్యాలలో కోదండరాంను కలిసి కాగజ్‌నగర్‌కు రావాలని ఆహ్వానించగా, ఈ నెల 26న పర్యటించేందుకు ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు వెల్లడించారు. అదే రోజు స్థానిక పటేల్ గార్డెన్స్‌లో తెలంగాణ ఉద్యమకారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసిఫాబాద్, సిర్పూరు నియోజకవర్గాలకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. కోదండరాంను కలిసిన వారిలో సిందం శ్రీనివాస్, హన్మంత్‌రావు, దెబ్బటి శ్రీనివాస్, ఇస్తారు, రాజేశ్వర్ తదితర ఉద్యమకారులు ఉన్నారు.

## కుమారిడితో మహిళ అదృశ్యం.. కేసు నమోదు

**కెరమెరి, జులై 12, ప్రభాతవార్త:**



కెరిమెరి మండలంలోని కొలం కొఠారి గ్రామా నికి చెందిన ఆత్రం పొచుబాయ్, వయస్సు 30 సంవత్సరాలు అనే మహిళ కుమారిడితో సహ గత కొన్ని రోజులుగా కనిపించకుండా పోవడంతో ఆమె తండ్రి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జూలై 9వ తేదీ ఉదయం ఇంటి నుంచి తన కుమారుడు రాకేష్(3) తో సహా బయటకు వెళ్లిన మహిళ తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో మహిళ తండ్రి కెరమెరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సదరు మహిళ ఆచూకీ తెలిసిన వారు కెరమెరి ఎస్ఐ 87126 70530 లేదా వాంకిడి సిఐ 8712670509 నంబర్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.




## మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం ఇవ్వాలి

**పథకాన్ని ప్రైవేటుకు అప్పగించొద్దు.. లేదంటే ఉద్యమాలు ఉధృతం**

**నస్పూర్, జులై 12, ప్రభాతవార్త:**

ఎన్నికల హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10 వేల వేతనం చెల్లించాలని, పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను విరమించుకోవాలని తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి కృష్ణమాచారి డిమాండ్ చేశారు. నస్పూర్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, కోడిగుడ్లు, గ్యాస్‌ను ప్రభుత్వం ఉచితంగా అందించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలోని అల్పాహార పథకం బకాయిలను వెంటనే చెల్లించాలని, పదవీ విరమణ చేసిన కార్మికులకు పెన్షన్, ఇతర ప్రయోజనాలు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశం అనంతరం సీఐటీయూ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ మంచిర్యాల జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## 14న కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి జిల్లా పర్యటన

**- సింగరేణి గనుల సందర్శనతో పాటు కార్మికులు, కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలతో సమావేశం**

**మంచిర్యాల, జులై 12, ప్రభాతవార్త:**

కేంద్ర గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఈ నెల 14వ తేదీ మంగళవారం మంచిర్యాల జిల్లాలో పర్యటించనున్నట్లు భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. తాడిచర్ల బొగ్గు గనుల ప్రాంతాన్ని సింగరేణికి కేటాయించిన అనంతరం తొలిసారిగా జిల్లాకు వస్తున్న కేంద్ర మంత్రి మధ్యాహ్నం 2 గంటలకు శ్రీరాంపూర్3 గనిని సందర్శించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు మంచిర్యాల పట్టణంలోని ఒక ప్రైవేటు ప్రాంగణంలో నిర్వహించే సమావేశంలో సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ పర్యటనలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రామచంద్రరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేరబెల్లి రఘునాథ్, శాసన మండలి సభ్యుడు అంజిరెడ్డితో పాటు పలువురు రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని భారతీయ జనతా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పిలుపునిచ్చారు.



## కామెర నాగరాజు స్థూపావిష్కరణ

**బెల్లంపల్లి, జులై 12, ప్రభాతవార్త:**

కన్నెపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో ఎంసీపీఐ(యు) నాయకుడు కామెర నాగరాజు 9వ వర్ధంతి సందర్భంగా ఆయన స్మారక స్థూపాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నాగరాజు ఆశయాల సాధన కోసం పోరాడుతామన్నారు. ఆదివాసీల పోడు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని, సాగుదారులపై అటవీ అధికారుల దాడులు, అక్రమ కేసులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లిలో శివాని జనరిక్ మెడికల్ స్టోర్ ప్రారంభం

**- సందర్శించి అభినందనలు తెలిపిన ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులురేణికుంట్ల ప్రవీణ్.**

**బెల్లంపల్లి, జులై 12, ప్రభాతవార్త:**

బెల్లంపల్లి పట్టణంలో జానహిత సేవ సమితి వ్యవస్థాపకులు ఆడెపు సతీష్ నూతనంగా ప్రారంభించిన శివాని జనరిక్ మెడికల్ స్టోర్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రముఖులు సందర్శించి అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, గజెల్లి చంద్రశేఖర్ మెడికల్ స్టోర్‌ను సందర్శించి యజమాని ఆడెపు సతీష్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు తక్కువ ధరల్లో నాణ్యమైన ఔషధాలు అందించే ఈ జనరిక్ మెడికల్ స్టోర్ సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని, మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షి ంచారు.

## వర్షాలు లేక రైతుల్లో ఆందోళన

**సారంగాపూర్, జులై 12, ప్రభాతవార్త:**

మండలంలోని అనేక గ్రామాల్లో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కాలంపై నమ్మకంతో ఇప్పటికే రెండుసార్లు చేలలో విత్తనాలు వేశారు. జూన్, జూలై మాసాల్లో కొద్దిపాటి వర్షాలే కురవడంతో చెరువులు, ప్రాజెక్టులు నిండలేదు. ప్రస్తుతం జూలై మధ్యకాలం వచ్చినప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో విత్తిన పంటలు ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. నీటి వసతి అందుబాటులో ఉన్న రైతులు తడులు ఇస్తుండగా, నీరు లేని ఆరుతడి రైతులకు పంటలపై ఆశలు వదులుకునే పరిస్థితి ఏర్పడింది. వాతావరణం ఇలాగే ఉంటే భూగర్భ నీటి మట్టాలు కూడా పడిపోతాయని, కరువు ప్రభావం తప్పదేమోనని రైతులు గుబులు చెందుతున్నారు.



వర్షాల్లేక ఎండిపోతున్న చేలను పరిశీలిస్తూ ఆందోళన చెందుతున్న రైతులు



ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య

## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా చేయాలి

### - అదనపు కలెక్టర్ చంద్రయ్య

**తాండూర్, జూలై 12, ప్రభాతవార్త :**

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య అన్నారు. ఆదివారం తాండూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పలు వార్డులలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ప్రక్రియను అదనపు కలెక్టర్ పరిశీలించారు. సర్వేకు వస్తున్న సిబ్బందికి ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో సహకరించి ఓటర్లు తమ వివరాలను దరఖాస్తు ఫారాల్లో నింపి బిఎల్ఓలకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసిల్దార్ కల్పన, గిర్దావర్ పద్మజ, ఎంపీఓ అనిల్ కుమార్, సర్పంచ్ ముడిమడుగుల సురేష్, ఈవో దివాకర్, కాంగ్రెస్ నేతలు ఎండి ఈసా, ఆదం ఖాన్, విష్ణు కళ్యాణ్, బి.ఎల్.ఏలు విజయలక్ష్మి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తే చర్యలు

### - తాండూర్ ఎస్సై ప్రసాద్

**తాండూర్, జూలై 12, ప్రభాతవార్త**



తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తే చర్యలు తప్పవని తాండూర్ ఎస్సై ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో ఎప్పుడైనా ఇసుక మట్టి అక్రమంగా నిల్వచేసిన, రవాణా చేసిన ప్రజలు పోలీసులు దృష్టికి తీసుకురావాలని సూచించారు. తమ దృష్టికి వస్తే శాఖపరంగా కేసులు నమోదు చేసి తగిన చర్యలు చూసుకుంటామన్నారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో పోచమ్మకు మొక్కులు

**ఆసిఫాబాద్, జులై 12, ప్రభాతవార్త :**

ఆషాఢ మాసం సందర్భంగా జిల్లా కేంద్రంలోని జనకాపూర్ కోదండరామాలయం కాలనీ వాసులు ఆదివారం సామూహికంగా పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి నైవేద్యాలను సిద్ధం చేసి అలంకరించిన బోనాలను తలపై ఎత్తుకుని డప్పు, మేళతాళాల నడుమ శోభాయాత్రగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభాయాత్రలో మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని భక్తి పారవశ్యాన్ని చాటగా యువకులు డప్పు దరువులతో ఉత్సవానికి మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చారు. ఆషాఢ మాసంలో ప్రతి ఏడాది పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించడం తమ కుటుంబాల సంప్రదాయమని భక్తులు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో పంటలు సమృద్ధిగా పండాలని, పశుసంపద వృద్ధి చెందాలని, గ్రామాలు, పట్టణాలు సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



శోభా యాత్రలో పాల్గొన్న భక్తులు

# ప్రవేశ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలి

### ఓటరు జాబితా సవరణ వివరాల నమోదు గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ చంద్రయ్య ఆదేశం

**మంచిర్యాల, జూలై 12 ప్రభాతవార్త:**

జిల్లాలో నిర్వహిస్తున్న ప్రతిభా విద్యాసంస్థల ప్రవేశ పరీక్షలను పూర్తి పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా కేంద్రం, తాండూరు ప్రాంతాల్లోని బాలికల విద్యాలయాల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను పరిశీలించి పరీక్షల నిర్వహణ, అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలను తనిఖీ చేశారు. తాగునీరు, విద్యుత్, పరిశుభ్రతతో పాటు అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం తాండూరు, నెన్నెల మండలాల గ్రామపంచాయతీలలో ఓటరు జాబితా సవరణకు సంబంధించిన వివరాల నమోదు పురోగతిని సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న వివరాలను ప్రాధాన్యంగా పూర్తి చేసి నిర్దేశిత గడువులోగా నమోదు చేయాలని, ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాల వద్ద పాల్గొన్న అదనపు కలెక్టర్

# ఎస్టీయూ జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

### - జిల్లా అధ్యక్షుడిగా ముడిమడుగుల తిరుపతి - ప్రధాన కార్యదర్శిగా చునార్కార్ తుకారం

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 12, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్, జూలై 11: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా ప్రత్యేక కార్యవర్గ సమావేశం శనివారం కాగజ్‌నగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ముడిమడుగుల తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా చునార్కార్ తుకారం ఎన్నికయ్యారు. రాష్ట్ర సహాయ అధ్యక్షులుగా పుర్కా మాణిక్‌రావు, దొడ్డిపట్ల రవికుమార్, రాష్ట్ర కార్యదర్శులుగా మామిడాల తిరుపతయ్య, వనమాల రాజేష్, అనుమాండ్ల సుధాకర్, సీహెచ్ సంజయ్‌కుమార్, అరీఫుద్దీన్, ఠాకూర్ జితేందర్ సింగ్‌లను ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎం.డి. సబీర్, జార్పుల వశ్రామ్, ఎస్.కే. సులేమాన్, గోపి, సామల శ్రీవర్ధన్, డింగ్రి గజానన్, మదాసు శ్రీనివాస్, సూత్రాల వేణు, జాడి సంతోష్, వై. నాగేష్, కాళిదాస్ మండల్, వైరగడే లక్ష్మణ్, పి.వి. కిషన్‌రావు, కుద్మేత బాదిరావు, నాగేందర్ గౌడ్, రాథోడ్ వినోద్, శ్యాంరావులను ఎంపిక చేశారు. మహిళా ఉపాధ్యక్షులుగా కె. ఉమారాణి, రజియా సుల్తానా, సుమిత, మహిళా కార్యదర్శులుగా సామల సుప్రియ, స్వరూప, త్రివేణి, లక్ష్మి ప్రసన్న, ఝాన్సీ, శ్రీలత, అన్నపూర్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి రాష్ట్ర అధ్యక్షుడు జి. సదానందం గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎం. పర్వత్ రెడ్డి, జాక్టో-కోటో చైర్మన్ పర్వతి సత్యనారాయణ అభినందనలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘాన్ని మరింత బలోపేతం చేసి సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

# ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### - ముంజం ఆనంద్ కుమార్

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 12, ప్రభాతవార్త :**

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ గ్రామ దళితవాడలో ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని నమోదు చేశారు. సర్వే సందర్భంగా గ్రామస్థులు తమ సమస్యలను సంఘం ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. దళితవాడలో ఇప్పటికీ అనేక కుటుంబాలు పెంకుటిళ్లలోనే నివసిస్తున్నాయని, అర్హులైన వారిలో కేవలం ముగ్గురు కుటుంబాలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, మిగిలిన పేద కుటుంబాలకు ఇళ్లు అందలేదని తెలిపారు. గ్రామంలో తాగునీటి సరఫరా సక్రమంగా లేదని, డ్రైనేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వీధి దీపాలు సరిగా వెలగడం లేదని, అనేక కుటుంబాలకు మరుగుదొడ్లు కూడా లేవని పేర్కొన్నారు. శ్మశానవాటిక లేకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వెంటనే శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని కోరారు. నివాస గృహాల కొరత కారణంగా ఒకే ఇంట్లో నాలుగు నుంచి ఐదు కుటుంబాలు నివసిస్తున్నాయని, అధికారులు, ప్రజాప్రతినిధులు తమ సమస్యలను పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులు కల్పించడంతో పాటు అర్హులైన దళిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామంలోని అందరికీ జాబ్ కార్డులు లేవని, ఉన్నవారికి కూడా సక్రమంగా పనులు కల్పించడం లేదని గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. చింతగూడ గ్రామంలోని తాగునీటి సమస్యతో పాటు దళితవాడలోని అన్ని మౌలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో గ్రామ ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బోర్కుట్ రాజేందర్, సీఐటీయూ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.




ప్రజలతో మాట్లాడుతున్న ముంజం ఆనంద్‌కుమార్